బుధవారం । 21 । జూన్ । 2023

ఆరోగ్య 'యోగ'ం

ఒత్తిడిని అధిగమించడానికి, శారీరక ఆరోగ్యానికి కాపాడుకోవడానికి ప్రపంచం మొత్తం యోగాను తమ జీవన విధానంలో భాగంగా చేసుకుంటోంది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

8లో▸



వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.9/29.6

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. వేడి, ఉక్కపోత కొనసాగుతాయి. వాడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి యోగాలో ఎల్వి విద్యార్థినికి స్వర్ణం



అవంతిక

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని అవంతిక 2022లో పతంజలి స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో నిర్వహించిన యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచింది. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చింది. అవంతిక ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రస్తుతం 7వ తరగతి చదువుతోంది. అవంతికను ప్రధానోపాధ్యాయుడు భూమన్నయాదవ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు అండర్-19, 25 జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

నిర్మల్‌చైన్‌గేట్:తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్మల్ జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ఉంటాయని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి నరోత్తంరెడ్డి, నిర్మల్ జిల్లా జట్టు కోచ్ రామరాజు, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మణికంఠ, లక్కీ క్రికెట్ అకాడమీ ఇన్‌చార్జి సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలు లక్కీ క్రికెట్ అకాడమీలో జరుగుతాయని పేర్కొన్నారు. అండర్-19కు ఆడేవారు ఏప్రిల్ 2004, అండర్-25 ఆడేవారు సెప్టెంబర్ 1998లో జన్మించి ఉండాలని సూచించారు. సెలక్షన్స్‌కు వచ్చే ఆటగాళ్లు ఆధార్ కార్డు, క్రికెట్ కిట్, వైట్ డ్రెస్ యూనిఫాం వెంట తెచ్చుకోవాలని తెలిపారు. సమాచారం కోసం 9912939724, 81061 08335 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ఆధ్యాత్మిక దినోత్సవం

నిర్మల్‌టౌన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించనున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మామిడి తోరణాలు, పూలు, విద్యుత్తు దీపాలతో ఆలయాలను అలంకరించడంతోపాటు వేద పారాయణం, అభిషేకాలు, హోమాలు, హరికథలు, కవి సమ్మేళనం, సత్కారాలు, శాస్త్రీయ సంగీతం- నత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. కొత్తగా 2,043 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు.

విప్లవోద్యమ నాయకుడు డీవీ కృష్ణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: అవిశ్రాంతంగా తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన విప్లవోద్యమ కమ్యూనిస్టు నాయకుడు డీవీ.కృష్ణ అని సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. డీవీ.కృష్ణ ప్రథమ వర్ధంతి సభ పోస్టర్‌ను మంగళవారం ఖానాపూర్‌లో ఆవిష్కరించారు. 1969లో కార్మిక శాఖ ఉద్యోగానికి రాజీనామా చేసి విప్లవ ఉద్యమంలోకి వచ్చి ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలో ఉద్యమ నిర్మాణం చేశారన్నారు. బీడీ కార్మికుల ఉద్యమ నిర్మాణానికి విశేష కృషిచేశారని తెలిపారు. 60 వేల మందికి పైగా బీడీ వర్కర్లతో ఐఎఫ్‌టీయూ యూనియన్‌ను బలోపేతం చేశారని పేర్కొన్నారు. జూన్ 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే డీవీ.కృష్ణ ప్రథమ వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో శంకర్, రాజన్న, వర్మ, గోరె భాయ్, లచ్చన్న, మధు, భీంరావు, సోనేరావు, దేవరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార సంస్థలుగా ప్రైవేటు పాఠశాలలు



మాట్లాడుతున్న వెంకటేశ్

నిర్మల్‌టౌన్: ప్రైవేట్ విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలను తలపిస్తున్నాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగారి వెంకటేశ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్‌లో గాంధీ విగ్రహం వద్ద అధిక ఫీజులపై మంగళవారం నిరసన తెలిపారు. పుస్తకాలు, బ్యాగులు, స్కూల్ యూనిఫాంలు విక్రయిస్తున్నాయని పేర్కొన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న, పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో సంతోష్, లక్ష్మణ్, దిగంబర్ పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర..







హరే రామ హరే రామ... రామ రామ హరే హరే.. హరే కృష్ణ హరే కృష్ణ.. కృష్ణ కృష్ణ హరే హరే.. నామస్మరణతో నిర్మల్ పట్టణం మంగళవారం సాయంత్రం మార్మోగింది. పట్టణంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్‌లోని మురళీకృష్ణ ఆలయం నుంచి ప్రారంభమై రథయాత్ర బుధవార్‌పేట్, గీతా విద్యాలయం, పాత బస్టాండ్ మీదుగా భాగ్యనగర్ రాధాకృష్ణ మందిరం వరకు కొనసాగింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దారిపొడవునా కోలాటం ఆడుతూ భక్తిని చాటుకున్నారు. మంగళహారతులతో జగన్నాథ రథానికి స్వాగతం పలికారు. అనంతరం భాగ్యనగర్ ఆలయంలో సంకీర్తనలు, ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 56 రకాల వంటకాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.


– నిర్మల్‌టౌన్

విద్య.. వ్యాపారం!



5వ తరగతి పుస్తకాలకు రూ.4,690 రశీదు

- భైంసా పట్టణానికి చెందిన ఓ విద్యార్థి ఓ ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. పాఠశాల పునఃప్రారంభం కావడంతో పాఠ్య పుస్తకాలు పాఠశాలలోనే విక్రయిస్తుండడంతో విద్యార్థి తండ్రి పాఠశాలకు వెళ్లగా నోటు బుక్కులు సైతం ఇక్కడే కొనాలని పాఠశాల నిర్వాహకులు కండీషన్ పెట్టారు. ఇదేంటని ప్రశ్నిస్తే తమకేమీ తెలియదని యాజమాన్యాన్ని అడగాలని సిబ్బంది సమాధానమిచ్చారు. దీంతో చేసేదేమీ లేక రూ.4,690 చెల్లించి పాఠ్య, నోటు పుస్తకాలు కొనుగోలు చేశాడు. రశీదు అడిగితే నిజామాబాద్‌లోని ఓ పుస్తక డీలర్ పేరిట ఇచ్చారు. తాను మీ పాఠశాలలో పుస్తకాలు కొనుగోలు చేస్తే నిజామాబాద్ బుక్ డీలర్ పేరిట రశీదు ఎందుకిచ్చారని ప్రశ్నిస్తే, వెంటనే పాఠశాల స్టాంపుతో తెల్ల కాగితంపై రశీదు ఇచ్చారు.



ఓ ప్రైవేటు పాఠశాలలో విక్రయించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు

- పాఠశాలల్లో పుస్తకాల దందా..!
- విద్యాశాఖ ఆదేశాలు బేఖాతరు
- యథేచ్ఛగా పాఠ్య, నోట్ పుస్తకాల విక్రయాలు

భైంసాటౌన్:ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యను ఇప్పటికే వ్యాపారంగా మార్చేశాయి. ఇన్నాళ్లు విద్య, వ్యాపారానికి సమాన ప్రాధాన్యం ఇచ్చేవారు. కానీ, ఇప్పుడు చదువు కంటే వ్యాపారానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ వంటి వస్తువులు విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం విక్రయించొద్దన్న విద్యాశాఖ అధికారుల ఆదేశాలను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయి.

ఇటు పుస్తకాలు.. అటు ఫీజులు..

ప్రస్తుతం నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైంది. పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఇప్పుడిప్పుడే బడిబాట పడుతున్నారు. ఆంగ్ల మాధ్యమం మోజులో చాలామంది మధ్య తరగతి తల్లిదండ్రులు సైతం ఆర్థికంగా అదనపు భారమైనా తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అటు ఫీజులు గుంజుతూనే, ఇటు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు, స్టేషనరీ పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. విద్యార్థికి అవసరమైన ప్రతీ వస్తువు పాఠశాలలోనే కొనాలని కండీషన్ పెడుతున్నాయి. ఇదేం తీరని బహిరంగంగా ప్రశ్నిస్తున్నవారు అధికారులకు ఫిర్యాదు చేయడానికి మాత్రం వెనుకాడుతున్నారు. ఇదే అలుసుగా తీసుకుంటున్న ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, వర్క్ బుక్కులంటూ విక్రయిస్తున్నారు. కనీసం ఒక్క రూపాయి కూడా తగ్గించకుండా పుస్తకాలపై ఉన్న ధరలకే విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్..

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, వర్క్ బుక్కులు విక్రయించొద్దని విద్యాశాఖ అధికారుల ఆదేశాలున్నాయి. అలాగే యూనిఫాంలు, టై, బెల్టు, స్టేషనరీ సైతం అమ్మవద్దనే నిబంధనలున్నాయి. ఇటీవల విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పుస్తకాలు విక్రయించొద్దని స్పష్టం చేశారు. అయినా, జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో యథేచ్ఛగా పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కుల విక్రయాలు చేస్తున్నారు. చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల తీరుతో ఇబ్బంది పడుతున్నా, అధికారులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు.

పట్టించుకోని అధికారులు...

దాదాపు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఈ పుస్తకాల దందా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఐదో తరగతి వరకు బయట మార్కెట్‌లో దొరకని పుస్తకాలు విక్రయిస్తున్నారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల్లోనే కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు నోటుబుక్కులు, యూనిఫాంలు విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీపై రూపాయి కూడా తక్కువ చేయకుండా ముక్కు పిండి వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. మరోవైపు విద్యాశాఖ అధికారులు ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. అధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి పుస్తకాలు విక్రయించకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు..

ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, స్టేషనరీ, యూనిఫాంలు విక్రయించొద్దు. ఇదివరకే పాఠశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఆదేశించాం. ఎక్కడైనా పాఠశాలల్లో పుస్తకాలు, నోటు బుక్కులు, స్టేషనరీ, యూనిఫాంలు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలి. తగిన చర్యలు తీసుకుంటాం.

– సుభాష్, ఎంఈవో, భైంసా

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య



పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి తదితరులు

- జిల్లా ఏర్పాటుతో మెరుగు పడిన విద్యాబోధన
- తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా విద్యా దినోత్సవం

నిర్మల్ రూరల్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యాబోధన జరుగుతోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో మంగళవారం విద్యా దినోత్సవం నిర్వహించారు. డీఈవో రవీందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదట 'మన ఊరు- మన బడి' కార్యక్రమం కింద మెరుగుపరచిన పాఠశాలల ఫొటోతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావా పంపిణీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేసిన పనులనే దశాబ్ది ఉత్సవాల్లో వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు వివరిస్తున్నామన్నారు. మన ఊరు- మనబడి కార్యక్రమం కింద 12 వసతులను పాఠశాలల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. నిర్మల్ జిల్లాగా ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. ఇంగ్లిష్ ప్రాధాన్యం గుర్తించి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభించిందని తెలిపారు. జ్ఞాన సరస్వతి అమ్మవారు కొలువైన నిర్మల్ జిల్లా గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లాకు మెడికల్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ వచ్చాయని.. ఇటీవలే ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంజినీరింగ్ కాలేజీని కూడా ప్రకటించారని తెలిపారు. విద్యాపరంగా జిల్లాలో అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థులను ప్రోత్సహించి ఉన్నతంగా ఎదిగేలా తీర్చిదిద్దాలని సూచించారు.

అన్నిరంగాల్లో ప్రోత్సహించాలి..

విద్యార్థులను చదువుతోపాటు, క్రీడలు, పరిశోధనలు, చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాసం, ఎన్‌సీసీ తదితర అంశాల్లోనూ ప్రోత్సహించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో బట్టీ విధానం మారాలన్నారు. పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. కృత్యాధార బోధనతో పాఠాలు సులభంగా అర్థమవుతాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం కూడా పదో తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జెడ్పీసీఈవో సుధీర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంలో దేశానికే ఆదర్శం

నిర్మల్ రూరల్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సీఎం కేసీఆర్ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నారని, తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మన ఊరు- మన బడి కార్యక్రమంలో నూతనంగా నిర్మించిన జిల్లా కేంద్రంలోని రాంనగర్, సోఫీనగర్ పాఠశాలలను కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 9 ఏళ్లలో ఊహించని విధంగా విద్యార్థులు పురోగతి సాధించారని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాలయాలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో బోధన, మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ.. మరోవైపు గురుకుల పాఠశాలలను నెలకొల్పి సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. మౌలిక వసతులను పరిశీలించారు. ఇందులో డీఈవో రవీందర్‌రెడ్డి, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనల్లో చిన్నారులు..



పేరిణి నృత్య ప్రదర్శన..



నృత్యం చేస్తున్న విద్యార్థిని

కష్టపడే ప్రతీ కార్యకర్తకు సముచిత గౌరవం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: భారతీయ జనతా పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు సముచిత గౌరవం లభిస్తుందని పార్టీ సీనియర్ నాకుడు, పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యగారి భూమయ్య, రావుల రామనాథ్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో మంగళవారం సీనియర్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలతో సమావేశం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గతంలో చాలామంది కార్యకర్తలు చురుకుగా పాల్గొనే వాళ్లన్నారు. గతంలో నిర్మల్ మున్సిపల్ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ పదవి చేపట్టడం జరిగిందని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన సీనియర్లందరినీ పార్టీ గుర్తిస్తుందని పేర్కొన్నారు. నరేంద్రమోదీ ప్రధానిగా తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జునరెడ్డి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఒడిసెల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, సీనియర్ నాయకులు కొరుపెల్లి నారాయణరెడ్డి, ఆడెపు సుధాకర్, వెంకట్రావు, రచ్చ మల్లేశ్, అయ్యన్నగారి రాజేందర్, టీఎస్.స్వామి, నారాయణగౌడ్, రాచకొండ సాగర్, ఆడెపు మహేందర్, బట్టు సంతోష్‌రాజ్, బట్టు హనుమంత్‌రాజ్, ముత్యంరెడ్డి, సాయన్న పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

తానూరు: గ్రామాల పరిశుభ్రతపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని డీపీవో శ్రీలత అన్నారు. మండలంలోని వాడవన, ఎల్వత్ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. గ్రామాల్లో మురికి కాలువల నిర్వహణ పనులు పరిశీలించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని సూచించారు. ప్రతీరోజు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాలని తెలిపారు. పల్లె ప్రకృతివనం, నర్సరీల నిర్వహణను పరిశీలించారు. వర్షాలు కురవగానే హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటించాలని పేర్కొన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీవో మోహన్‌సింగ్, సర్పంచ్ సునీత, పంచాయతీ కార్యదర్శి మహేశ్ ఉన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి, కలెక్టర్

సారంగపూర్: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం జాతీయ పతాకం ఎగురవేశారు. అనంతరం రూ.17 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. తెలంగాణలో విద్యారంగంలో సమూల మార్పులు వచ్చాయని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం చించోలి(బి) గ్రామంలో నూతనంగా నిర్మించిన మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, అడెల్లి ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు అయిటి చందు, సర్పంచ్ సుజాత, ఆలూరు, కౌట్ల పీఏసీఎస్ అధ్యక్షులు మాణిక్‌రెడ్డి, అయిర నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మొబైల్ షాపులో చోరీ

• రూ.లక్షా 80వేల ఫోన్లు అపహరణ



మొబైల్ షాపు రేకులు పగలగొట్టిన దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. ఎప్పుడు రద్దీగా ఉండే అంబేద్కర్ చౌక్ ప్రాంతంలోని ఓ మొబైల్ షాప్‌కు కన్నం పెట్టారు. షాపులోని కొత్త ఫోన్‌లతో పాటు రిపేర్ కోసం వచ్చిన ఫోన్‌లను సైతం ఎత్తుకెళ్లారు. దొంగతనానికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధితుడి వివరాల ప్రకారం.. పట్టణంలోని గణేష్ థియేటర్ సమీపంలోని ఆపిల్ మొబైల్ షాపులో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రూ.1.60 లక్షల విలువ గల 12 కొత్త మొబైల్ ఫోన్‌లతో పాటు రూ.20వేల విలువ గల వినియోగదారుల ఆరు సెల్‌ఫోన్‌లు అపహరణకు గురైనట్లు ఆ షాపు యజమాని అబ్దుల్ జాహిద్ తెలిపారు. దుండగులు దుకాణంపైన గల రేకులను తొలగించి లోనికి చొరబడ్డారు. రెండేళ్ల క్రితం సైతం ఇదేవిధంగా షాపులో చోరీ జరిగింది. ఘటన స్థలానికి ఫోరెన్సిక్, పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

రిమ్స్‌లో రిమాండ్ ఖైదీ మృతి



మహేశ్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నిర్మల్ జైలు సూపరింటెండెంట్ చిరంజీవి వివరాల ప్రకారం... కుభీర్ మండలంలోని దార్‌కుబీర్‌కు చెందిన బంక మహేశ్ (30) ఈ నెల 13న కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చాడు. అన్నదమ్ముళ్ల మధ్య భూతగాదాల మధ్య హత్యాయత్నానికి పాల్పడడంతో 307 సెక్షన్ కింద జైలుకు తరలించారు. అదే రోజు రాత్రి అనారోగ్యం బారిన పడడంతో నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నెల 16వ తేదీ వరకు అక్కడే చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ నెల 17 నుంచి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు.

ఆస్పత్రిలో గుర్తు తెలియని యువకుడు



రిమ్స్‌లో గుర్తు తెలియని యువకుడు

నేరడిగొండ: మండలంలోని బందంరేగడి అటవీ ప్రాంతంలో స్పృహ కోల్పోయిన ఓ గుర్తు తెలియని యువకుడు సోమవారం పశువుల కాపరులకు కనిపించాడు. వారు పోలీసులను సంప్రదించడంతో నేరడిగొండ ఎస్సై సాయన్న అక్కడికి చేరుకొని ఆ యువకుడిని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి పంపించారు. సదరు యువకుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, సంబంధికులు ఎవరైన ఉంటే నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో సెల్ నం.8712 659947పై సంప్రదించాలని పేర్కొన్నారు.

18ఏళ్లుగా ఆరోగ్యంగా ఉన్న..



2006 నుంచి యోగా సాధన చేస్తున్నాను. ఈ 18 ఏళ్లలో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఒత్తిడికి దూరంగా ఉంటున్న. గతంలో ఆదిలాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తలలో రక్తం గడ్డ కట్టిందని డాక్టర్లు చెప్పారు. అప్పుడు రాందేవ్ బాబా స్ఫూర్తితో యోగాను అలవాటు చేసుకున్నాను. అనంతరం గడ్డకట్టిన రక్తం క్రమంగా సాధారణ స్థితికి వచ్చిందని డాక్టర్లు తెలిపారు. అప్పటినుండి మరింత ఉత్సాహంగా క్రమం తప్పకుండా యోగా చేస్తున్నాను. నిర్మల్ జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాల ఆవరణలో రోజు ఉదయం రెండు గంటల పాటు యోగాలో శిక్షణ ఇస్తున్నాను.

– జంగిలి బాలాజీ యాదవ్, యోగా శిక్షకులు, (హెడ్ కానిస్టేబుల్), నిర్మల్

యోగా సాధనతో ఒత్తిడి దూరం..



విధి నిర్వహణలో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు బిజీ షెడ్యూల్ లో ఉండడం మూలంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యేవాడిని. డాక్టర్లను సంప్రదించగా ఉదయం సాయంత్రం రెండు పూటలు టాబ్లెట్లను వాడమన్నారు. అయితే తెలిసిన మిత్రులు యోగా సాధన చేయమని సలహానివ్వగా, గత పది నెలలుగా జిల్లా కేంద్రంలో ప్రతిరోజు ఉదయం యోగా సాధన చేస్తున్నాను. ఒత్తిడి పూర్తిగా తగ్గింది. – కొందారి కిరణ్ కుమార్, ప్రైవేటు ఉద్యోగి, నిర్మల్

నిత్య జీవితంలో భాగం కావాలి...



నేను పదేళ్లుగా యోగా సాధన చేస్తున్న. ప్రస్తుతం నా వయసు 60కి దగ్గరగా ఉంది. ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నానంటే మంచి ఆరోగ్య అలవాట్లు, యోగా సాధన ద్వారానే. పలు మానసిక, ఆరోగ్య సమస్యలకు పరిష్కారం యోగా ద్వారా లభిస్తుంది. ఒత్తిడితో కూడిన ప్రస్తుత జీవన విధానంలో ఉదయం ఒక గంట యోగాకు కేటాయించడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి.

– పట్టోలి ముత్యం, యోగా సాధకులు, ఎంఈవో (మామడ, కుంటాల), నిర్మల్

ఆరోగ్య 'యోగ'ం



మామడ: జిల్లా కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న మహిళలు



భావన, కడెం

ఒత్తిడిని అధిగమించడానికి, శారీరక ఆరోగ్యానికి కాపాడుకోవడానికి ప్రపంచం మొత్తం యోగాను తమ జీవన విధానంలో భాగంగా చేసుకుంటోంది. మనిషి మానసిక, శారీరక, ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తోంది. కాబట్టే ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు యోగాను పాటిస్తున్నాయి. అలాంటి యోగాను ప్రపంచానికి పరిచయం చేసింది భారతదేశం. 2015 నుంచి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. నేడు 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - నిర్మల్‌ఖిల్లా

• ఒత్తిడి, డిప్రెషన్ దూరం.. • ఏకాగ్రత, దృఢచిత్తానికి తరుణోపాయం.. • ఆరోగ్య సమస్యలకు అద్భుత పరిష్కారం • నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం..

యోగాకు కేరాఫ్ ఇలేగాం..!



యోగా శిక్షణ ఇస్తున్న సీహెచ్ వీరన్న

భైంసాటౌన్: యోగా.. కేరాఫ్ ఇలేగాం అంటే అతిశయోక్తి కాదనిపిస్తోంది. ఈ గ్రామం నుంచి యువకులు యోగాలో శిక్షణ పొందడమే కాకుండా యోగానే ఉపాధిగా మార్చుకున్నారు. ఒకరు విదేశాల్లో సైతం యోగా తరగతులు నిర్వహిస్తుండగా, మరొకరు హైదరాబాద్‌లో సొంతంగా యోగా ఇనిస్టిట్యూట్ నెలకొల్పి తరగతులు నిర్వహిస్తున్నారు. మిగిలినవారు స్థానికంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, చిన్నారులకు శిక్షణ ఇవ్వడమేకాక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. వీరందరికీ స్ఫూర్తి గ్రామానికే చెందిన యోగా గురువులు మతీన్, పోతన్న. వీరు గ్రామంలో దాదాపు 30మందికి యోగా శిక్షణ ఇవ్వగా వారిలో ఐదుగురు యోగా ద్వారానే ఉపాధి పొందుతున్నారు.



సింగపూర్‌లో యోగా తరగతులు నిర్వహిస్తున్న కృష్ణకుమార్

వ్యవసాయం, యోగా...



రాష్ట్రస్థాయి పతకాలు సాధించిన విద్యార్థులతో శిక్షకుడు మల్లేశ్

మల్లేశ్ ఓ వైపు కుటుంబ పోషణ కోసం వ్యవసాయం చేస్తూనే మరోవైపు యోగా శిక్షణతోనూ ఉపాధి పొందుతున్నాడు. గ్రామానికి చెందిన యోగా గురువు మతీన్ నుంచి స్ఫూర్తి పొందాడు. మల్లేశ్ హైదరాబాద్‌లో యోగా కోర్సులో డిప్లొమా పూర్తి చేసుకుని కొన్నేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహిస్తూ, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా శిక్షణ అందిస్తున్నాడు. మల్లేశ్ సైతం ఇప్పటి వరకు మూడుసార్లు జాతీయ స్థాయిలో పతకాలు సాధించాడు.

అన్నదమ్ములిద్దరూ...



యోగా సాధన చేస్తున్న వీరన్న



సీహెచ్ గంగాధర్

సీహెచ్ గంగాధర్, వీరన్నలు అన్నాదమ్ములు. 2001 నుంచి ఇద్దరూ యోగా సాధన చేస్తున్నారు. వీరన్న బెంగళూరులోని వ్యాస యూనివర్సిటీలో యోగా థెరపీలో ఎంఎస్సీ చేయగా గంగాధర్ తమిళనాడులో కోర్సు చేశాడు. వీరన్న పదేళ్లుగా హైదరాబాద్‌లో స్థిరపడి అక్కడే ప్రణవ అథ పేరిట యోగా ఇనిస్టిట్యూట్ నెలకొల్పి శిక్షణ ఇస్తున్నాడు. గతంలో ప్రముఖ టీవీ యాంకర్ సుమకు సైతం యోగా తరగతులు చెప్పినట్లు వీరన్న తెలిపారు. గంగాధర్ వద్ద శిక్షణ తీసుకున్న నిజామాబాద్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించారు.

యోగాలో మేటి.. అంబారిపేట్

కడెం: మండలంలోని అంబారిపేట్ జిల్లా పరిషత్ పాఠశాల యోగాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాఠశాల పీఈటీ షేక్ ఇమ్రాన్ ప్రత్యేక చొరవతో 2015 నుంచి ఇక్కడి విద్యార్థులు యోగాసనాలు నేర్చుకుంటున్నారు. ఏడేళ్లుగా పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో, 50 మంది విద్యార్థులు జిల్లా స్థాయి యోగా పోటీల్లో రాణించారు. యోగా గురువు షేక్ ఇమ్రాన్ ద్వారా శిక్షణ తీసుకుంటున్నారు.

సిల్వర్ మెడల్ సాధించా



పీఈటీ ఇమ్రాన్ సార్ అంబారిపేట్ పాఠశాలలో యోగాలో మాకు ఇచ్చిన శిక్షణతో నాలుగు సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ప్రస్తుతం నేను డిగ్రీ చదువుతున్న. 2018లో రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించాను. ఇటీవలే ప్రభుత్వం నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా యోగాసనాలు నేర్పించాను. -సుకన్య, రాష్ట్రస్థాయి క్రీడాకారిణి

జాతీయ స్థాయి పోటీలకు కోచ్‌గా..



2015 నుంచి అంబారిపేట్ ప్రభుత్వ పాఠశాల పీఈటీగా విధులు నిర్వహిస్తున్న. 2016, 2018లో జాతీయ స్థాయి యోగా పోటీలకు తెలంగాణ రాష్ట్ర కోచ్‌గా, మూడుసార్లు యోగా పోటీలకు రాష్ట్ర పరిశీలకులుగా వ్యవహరించాను. ప్రతీ రోజు విద్యార్థులతో వార్మప్ ఎక్సర్‌సైజ్‌లు, ధ్యానం చేయించి యోగాసనాలు ప్రారంభిస్తాం. -షేక్ ఇమ్రాన్, పీఈటీ,


మూడుసార్లు గోల్డ్ మెడల్...



రవీందర్

భైంసాటౌన్: ఉప్పు రవీందర్ యోగాలో శిక్షణ పొందడమే కాకుండా యోగా కోర్సు పీజీ డిప్లొమా పూర్తి చేశాడు. పదేళ్లుగా భైంసాతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యోగా శిక్షకుడిగా పనిచేస్తున్నాడు. ఇప్పటివరకు మూడుసార్లు జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించాడు. స్థానికంగా విద్యార్థులు, పిల్లలకు యోగాలో శిక్షణ ఇస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు.

ఔరా.. అనిపించే ఆసనాలు



భార్గవ్

తలమడుగు: మండలంలోని అర్లీకే గ్రామానికి చెందిన బోండ్ల వెంకటస్వామి కవిత దంపతుల కుమారుడు భార్గవ్ యోగా ఆసనాలలో ప్రతిభ కనబర్చుస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని బాలాజీ విద్య మందిర్‌లో 7వ తరగతిలో యోగా శిక్షణ తీసుకున్నాడు. అప్పటినుంచి జిల్లా స్థాయి పోటీలో రాణిస్తూ పథకాలు సాధిస్తున్నాడు.

యోగాతోనే ఆరోగ్యం



మామడ: నాకు రోడ్డు ప్రమాదంలో కాలుకు, తలకు బలమైన దెబ్బ తగిలింది. తలలోని నరాలకు శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. యోగాతో ఫలితం ఉంటుందని తెలుసుకుని యోగాను ప్రారంభించాను. యోగా చేయడంతో ఎలాంటి శస్త్రచికిత్స లేకుండానే ఆరోగ్యం బాగుపడింది. యోగాను ప్రతి రోజు చేయడంతో పాటు పలువురికి యోగాను నేర్పిస్తున్నాను.

– బాలాజీ, యోగా శిక్షకుడు, నిర్మల్

విదేశాల్లో మనోళ్ల యోగా పాఠాలు



సింగపూర్‌లో యోగా నేర్పిస్తున్న కృష్ణకుమార్


భైంసాటౌన్: ఇలేగాం గ్రామానికి చెందిన కృష్ణకుమార్ యోగాలో శిక్షణ పొంది ఏకంగా సింగపూర్, ఇండోనేషియాతో పాటు ఇతర దేశాల్లో యోగా పాఠాలు చెబుతున్నారు. భార్య జీవితతో కలిసి శిక్షణ అందిస్తున్నాడు. 2012లో బెంగళూరులోని వ్యాస యూనివర్సిటీలో యోగాలో ఎంఎస్సీ, డిప్లొమా చేశాడు. 2016 వరకు ఢిల్లీలో మోదీ గ్రూప్ ఆఫ్ కంపెనీసలో యోగా శిక్షకుడిగా చేయగా అక్కడి నుంచి టర్కీ వెళ్లి యోగా తరగతులు నిర్వహించాడు. 2015లో చెన్నైకి చెందిన జీవితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇండోనేషియాలోని ఇండియన్ ఎంబసీలో జీవితకు యోగా, కల్చరల్ టీచర్‌గా ఉద్యోగం రావడంతో రెండేళ్లు అక్కడే పని చేశాడు. 2108లో సింగపూర్‌కు వెళ్లి నాలుగేళ్లు.. సింగపూర్ ప్రభుత్వం నుంచి ఉత్తమ శిక్షకుడిగా సైతం అవార్డు సైతం అందుకున్నాడు.

యోగాతో మంచి ఆరోగ్యం



మామడ: ప్రతి రోజు యోగా చేయడంతో మంచి ఆరోగ్యం లభిస్తుంది. నిత్యం బిజీగా ఉండే వారు ఒత్తిడిని జయించి ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. యోగాపై శిబిరాలను నిర్వహించి అవగాహన కల్గించాం. రోజు అరగంట యోగాకు కేటాయిస్తే చిన్నచిన్న రుగ్మతలకు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. – సంధ్యారాణి, ఆయుష్ వైద్యురాలు

యోగా సర్వరోగ నివారిణి..



ఆదిలాబాద్: ప్రస్తుత ఆధునిక జీవన శైలి, ఒత్తిడి కారణంగా ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం యోగా సాధన చేయడంతో వీటి నుంచి ఉపశమనం పొందవచ్చు. మనస్సు, వాక్కు, కర్మలను నియంత్రించుకోవడంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పొందేందుకు యోగా దోహదపడుతుంది. – తిరుపతి రెడ్డి, యోగా శిక్షకుడు, ఆదిలాబాద్

ట్రిపుల్‌ఐటీలో విద్యా దినోత్సవం



మాట్లాడుతున్న సెక్రటరీ మారుపాక నగేశ్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో మంగళవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ విద్యావిధానం, అకాడమిక్ పరంగా తీసుకున్న నిర్ణయాలు, చర్యలు, బాసర క్యాంపస్‌లో సాధించిన విజయాలు, విద్యార్థుల పాత్ర, అధ్యాపకులు ఉద్యోగుల పాత్రపై ఆయన వెల్లడించారు. అనంతరం టీఎస్ కాస్ట్ సెక్రటరీ మారుపాక నగేశ్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ, టీఎస్ కాస్ట్ మధ్య అవగాహన ఒప్పందం జరిగిందని, రానున్న రోజుల్లో ఇక్కడి విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు ట్రావెల్స్ సీజ్

• పరిమితికి మించి ప్రయాణికులను తరలించడంతో..



ఆదిలాబాద్: అల్పాహారాన్ని వడ్డిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న మూడు ట్రావెల్స్‌లను రవాణ శాఖాధికారులు సోమవారం అర్ధరాత్రి సీజ్ చేశారు. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులను ఆర్టీసీ బస్టాండ్‌లో దింపారు. హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు కార్మికులను తీసుకెళ్తున్నారు. ఒక్కో బస్సులో 30వరకు పరిమితి ఉండగా వంద మంది వరకు ప్రయాణికులను తరలిస్తున్నారు. ఈ క్రమంలో తనిఖీలు చేపట్టిన రవాణ శాఖాధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆ ట్రావెల్స్‌లను సీజ్ చేసి ఆర్టీసీ డిపోలో ఉంచారు. అందులో ప్రయాణిస్తున్న వారిని బస్టాండ్‌లో దింపడంతో వారు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం రవాణ శాఖాధికారులు ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా వారికి భోజనం ఏర్పాటు చేయించారు. వీరిని ఛత్తీస్‌ఘడ్‌కు తరలించేందుకు ఆ బస్సుల యజమానుల నుంచి డబ్బులు రాబట్టి రెండు ఆర్టీసీ బస్సుల ద్వారా వారి గమ్యస్థానాలకు చేర్చేవిధంగా చర్యలు చేపట్టారు. మిగిలిన మరికొంత మంది కోసం మరో బస్సును ఏర్పాటు చేస్తామని డీటీసీ పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. ఇదిలా ఉండగా రెండుమూడు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు వెళ్తున్న రెండు బస్సులను సీజ్ చేసిన విషయం తెలిసిందే.

ఆదిలాబాద్: ప్రయాణికుల సౌకర్యం కోసం అల్పాహారం పంపిణీ చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం జానీ రెడ్డి, డీటీసీ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న మూడు ప్రైవేటు ట్రావెల్స్‌లను సోమవారం సీజ్ చేశారు. ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో బస్సులను నిలుపగా, ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోనే నిరీక్షించాల్సిన పరిస్థితి. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఎంవీఐ శ్రీనివాస్, డీఎం కల్పన పాల్గొన్నారు.

విద్యార్థులతో సరస్వతి పూజ

భైంసా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బాసర ఆలయంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరస్వతీ పూజ చేయించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో ప్రతి రోజు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలను బాసర ఆలయానికి పిలిపించారు. విద్యార్థులందరితో సరస్వతి పూజ చేయించారు.